www.prajasakti.com
ప్రజాశక్తి
సోమవారం 25 డిసెంబర్ 2023
5
వైఎస్ఆర్

ప్రతి ఉద్యోగికీ అవగాహన అవసరం

ప్రజాశక్తి - కడప అర్బన్

ప్రతి ఉద్యోగికీ క్రమశిక్షణ చర్యపై అవగాహన ఉండాలని జిల్లా పంచాయతీ అడ్మినిస్ట్రేషన్ ఆఫీసర్ ఖాదర్‌బాషా అన్నారు. ఆదివారం జిల్లాలోని గ్రామీణ సచివాలయంలో పనిచేస్తున్న సచివాలయం సిబ్బందికి శిక్షణలో భాగంగా స్మిత్ రోడ్ లో ఉన్న నిహార్ స్కిల్ ఎడ్యుకేషన్ లో మాస్టర్ ట్రైనర్ గా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉద్యోగస్తులు విధి విధానాల్లో సక్రమంగా పనిచేయాలని పేర్కొన్నారు. ఉద్యోగి తన విధుల పట్ల అంకిత భావంతో పనిచేయాలన్నారు. విధులకు తప్పనిసరిగా హాజరు కావాలని తెలిపారు. ప్రతి ఉద్యోగస్తులు తమ జాబ్ చార్ట్ ప్రకారము కచ్చితంగా పనిచేయాలని చెప్పారు. రూల్స్ పైన పూర్తి అవగాహన కల్పించారు. కార్యక్రమంలో నియర్ స్కూల్ ఎడ్యుకేషన్ మేనేజింగ్ డైరెక్టర్ ఇంతియాజ్ అహమద్ పాల్గొన్నారు.

కడప : పాతబస్టాండ్‌లోని పూలే సర్కిల్ వద్ద కొవ్వొత్తులతో నిరసన తెలియజేస్తున్న అంగన్వాడీలు, నాయకులు

నిరసనల హోరు.. తగ్గని జోరు

- బద్వేల్ చర్చిలో ప్రార్థనలు
- జిల్లా వ్యాప్తంగా కొవ్వొత్తులతో నిరసన
- పలువురు నాయకులు, ప్రజాసంఘాల మద్దతు

తమ న్యాయమైన డిమాండ్లను పరిష్కరించాలంటూ వైఎస్ఆర్ జిల్లాలో అంగన్వాడీ కార్యకర్తలు, ఆయాలు చేపట్టిన నిరవధిక సమ్మె ఆదివారం నాటికి 13వ రోజుకు చేరుకుంది. జిల్లా వ్యాప్తంగా ఉన్న ఐసిడిఎస్, తహశీల్దార్, ఎంపిడిఒ కార్యాలయాల ఎదుట అంగన్వాడీలు పెద్ద ఎత్తున ఆందోళనలు కొనసాగిస్తున్నారు. క్రిస్మస్ సందర్భంగా చర్చిలో ప్రార్థనలు చేస్తూ.. నాలుగు రోడ్ల కూడలి వద్ద కొవ్వొత్తులతో, చెవిలో పూలు పెట్టుకుని, ఆకులు తింటూ వినూత్నంగా నిరసన తెలియజేశారు.

బద్వేల్ : ముఖ్యమంత్రికి మంచి బుద్ధి ఇవ్వాలని చర్చిలో ప్రార్థనలు చేస్తున్న అంగన్వాడీలు

కడప అర్బన్ : జిల్లాలో పర్యటిస్తున్న సిఎం జగన్‌మోహన్‌రెడ్డి 13 రోజులుగా నిర్వహిస్తున్న అంగన్వాడీ సమ్మెపై స్పందించి వారి న్యాయమైన డిమాండ్లు తీర్చాలని సిఐటియు నగర ప్రధాన కార్యదర్శి పి.సుబ్బయ్య, డివైఎఫ్ఐ నగర కార్యదర్శి డి.ఎం. ఓబులేసు డిమాండ్ చేశారు. ఆదివారం అర్బన్ లో చెవులో పూలు పెట్టుకుని, రూరల్ లో ఆకులు తింటూ నిరసన వ్యక్తం చేశారు. సమ్మెలో భాగంగా సాయంత్రం పాత బస్టాండ్ లోని పూలే సర్కిల్ వద్ద కొవ్వొత్తులతో నిరసన కార్యక్రమం చేపట్టారు. నిరసన కార్యక్రమానికి సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి మనోహర్, డివైఎఫ్ఐ జిల్లా కార్యదర్శి ఓబులేసు సంపూర్ణ మద్దతు తెలియజేశారు. హామీలు అమలు చేసే వరకు అంగన్వాడి సమ్మెకు అండగా ఉంటామని తెలిపారు. కార్యక్రమంలో యూ నియన్ అర్బన్ ప్రాజెక్టు కార్యదర్శి అంజలీదేవి, దీప, హైమావతి, కార్యకర్తలు, ఆయాలు వసుంధర, కార్యకర్తలు, ఆయాలు పాల్గొన్నారు. **దువ్వూరు :** స్థానిక తహశీల్దార్ కార్యాలయం ఎదుట అంగన్వాడీలు నిర్వహిస్తున్న సమ్మె ఆదివారం 13వ రోజుకు చేరుకుంది. అంగన్వాడీలు మోకాళలపై నిల్చుని కొవ్వొత్తులతో నిరసన తెలియజేశారు. ఈ నిరసనలో అంగన్వాడీ కార్యకర్తలు తమ చంటి బిడ్డలతో కలిసి ఆందోళనలో పాల్గొన్నారు. వారికి మధ్యాహ్న భోజన కార్మికులు సంఘీభావం తెలియజేశారు. **బద్వేల్ :** అంగన్వాడీ వర్కర్లు చేస్తున్న రాష్ట్ర వ్యాప్త సమ్మె 13వ రోజులో భాగంగా సిద్ధవటం రోడ్డు లోని సిఎస్ఐ చర్చిలో చర్చి నందు అంగన్వాడీల న్యాయమైన సమస్యలు పరిష్కరించేలా జగనన్నను ఆశీర్వదించాలని దైవజనులు బాబు గారి ఆధ్వర్యంలో యేసుక్రీస్తు ప్రభువును ప్రార్థించారు. యూనియన్ ప్రాజెక్టు నాయకురాలు జయప్రద మాట్లాడుతూ యేసుక్రీస్తు జన్మదిన సందర్భంగా ప్రత్యేక ప్రార్థనలో పాల్గొనుటకు జిల్లా పర్యటనకు వచ్చిన ముఖ్యమంత్రి అంగన్వాడీలకు ఇచ్చిన హామీలను అమలు చేయాలని కోరారు. కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘం గోపవరం మండల నాయకులు కదిరయ్య, భారత ప్రజాతంత్ర యువజన సమాఖ్య (డివైఎఫ్ఐ) జిల్లా అధ్యక్షుడు ముడియం చిన్ని, అంగన్వాడి వర్కర్స్ హెల్పర్స్ యూనియన్ బద్వేలు ప్రాజెక్టు నాయకురాళ్లు సత్యవతి, కళావతి, విజయమ్మ, తులసమ్మ ,వెంకట నరసమ్మ, వసంతమ్మ, శ్రీలత ,కృష్ణ వేణి, రాధమ్మ, అరుణమ్మ, మహాలక్ష్మి, లక్ష్మీన రసమ్మ, లీలావతి, ఉమాదేవి, ప్రాజెక్టు పరిధిలోని అంగన్వాడీ వర్కర్స్ హెల్పర్స్ పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. **జమ్మలమడుగు :** ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డి చిత్తశుద్ధిని నిరూపించుకోవాలని పిసిసి మీడియా చైర్మన్ తులసిరెడ్డి పేర్కొన్నారు. పట్టణంలోని ఐసిడిఎస్ కార్యాలయం ఎదురుగా నిర్వహిస్తున్న సమ్మె 13వ రోజుకు చేరింది. సమ్మెకు కాంగ్రెస్ పార్టీ నాయకులు సంఘీభావం తెలిపారు. ఈ సందర్భంగా తులసి రెడ్డి మాట్లాడుతూ అంగన్వాడీలకు సిఎం ఇచ్చిన వాగ్దానాలు నెరవేర్చాలన్నారు. కార్యక్రమంలో సిపిఎం పట్టణ కార్యదర్శి ఏసుదాసు, కాంగ్రెస్ నాయకులు భూతమాపురం సుబ్బారావు, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు పుష్పరాజ్, పాముల బ్రహ్మానంద రెడ్డి, డివైఎఫ్ఐ నాయకులు శివకుమార్, ఎస్ఎఫ్ఐ నాయకులు వినయ్ కుమార్, అంగన్వాడీ యూనియన్ నాయకులు భాగ్యమ్మ, లక్ష్మీదేవి, నరసమ్మ, సుబ్బలక్ష్మి పాల్గొన్నారు. **చాపాడు :** స్థానిక తహశీల్దార్ కార్యాలయం ఎదుట అంగన్వాడీ కార్యకర్తలు ఆదివారం తమ న్యాయమైన కోరికలను పరిష్కరించాలని నిర్వహిస్తున్న సమ్మె ఆదివారం 13వ రోజుకు చేరుకుంది. ఈ సందర్భంగా అంగన్వాడీ కార్యకర్తల మాట్లాడుతూ చాలి చాలని జీతాలతో కుటుంబాన్ని నెట్టుకొస్తున్నామని, ఎన్నికలకు ముందు సీఎం జగన్ ఇచ్చిన హామీని నిలబెట్టుకోవాలని పేర్కొన్నారు. కార్యక్రమంలో అంగన్వాడీ కార్యకర్తలు పద్మ, విజయ, ఝాన్సీ, అంజనమ్మ పాల్గొన్నారు. **పోరుమామిళ్ల :** అంగన్వాడీ కార్యకర్తలు పట్టణంలోని గాంధీ బొమ్మ విగ్రహం వద్ద సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు భైరవ ప్రసాద్ ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమాన్ని తెలియజేశారు. కార్యక్రమంలో అంగన్వాడీ యూనియన్ మండల అధ్యక్ష, కార్యదర్శులు రేణుకాదేవి, జ్యోతి, నారాయణమ్మ, స్వాతి, రమాదేవి, సిఐటియు మండల నాయకులు బొజ్జ చిన్నయ్య, అంగన్వాడి టీచర్లు వర్కర్లు, మినీ అంగన్వాడీ టీచర్లు పాల్గొన్నారు. ఖాజీపేట : అంగన్వాడీ సిబ్బంది సమస్యలను పరిష్కరించకపోతే ప్రభుత్వానికి తగిన బుద్ధి చెప్తామని, సమస్యల పరిష్కారం కోసం ఉద్యమాలు చేస్తున్నా ప్రభుత్వం స్పందించకపోవడం సిగ్గు చేటు కరమని ఏపీ ప్రగతిశీల అంగన్వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ సంఘము రాష్ట్ర అధ్యక్షురాలు జె. గంగావతి అన్నారు. స్థానిక బస్టాండ్ కూడలిలో ఆదివారం అంగన్వాడీల సమస్యలను పరిష్కరించాలని కోరుతూ కొవ్వొత్తు లతో నిరసన ప్రదర్శన చేపట్టారు.

కడప : చెవిలో పూలు పెట్టుకుని నిరసన తెలియజేస్తున్న అంగన్వాడీలు

సింహాద్రిపురం : తహశీల్దార్ కార్యాలయ ప్రారంభోత్సవంలో సీఎం జగన్

వేంపల్లె : వైఎస్ఆర్ విగ్రహానికి నివాళి అర్పిస్తున్న ముఖ్యమంత్రి

అభివృద్ధిలో పులివెందుల ఆదర్శం

- ఇడుపులపాయలో క్రిస్మస్ ప్రార్థనలు
- పలు అభివృద్ధి పనుల ప్రారంభోత్సవాల్లో ముఖ్యమంత్రి వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి

ప్రజాశక్తి -వేంపల్లె/సింహాద్రిపురం

పులివెందుల నియోజకవర్గం అభివృద్ధికి నిదర్శనమని ముఖ్యమంత్రి వైఎస్.జగన్ మోహన్‌రెడ్డి అన్నారు. మూడు రోజుల జిల్లా పర్యటనలో భాగంగా రెండవ రోజు ఆదివారం ఇడుపులపాయలో ముఖ్యమంత్రి జగన్ కుటుంబ సభ్యులు, ప్రజాప్రతినిధులు, అధికారులతో కలిసి క్రిస్మస్ ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. వైఎస్ఆర్ ఘాట్ వద్ద మాజీ ముఖ్యమంత్రి రాజశేఖర్‌రెడ్డికి నివాళులర్పించారు. సింహాద్రిపురంలో రూ36.03 కోట్లతో చేపట్టిన అభివృద్ధి పనులకు ప్రారంభోత్సవాలు చేశారు. ఇడుపులపాయ వ్యవసాయ క్షేత్రంలో పులివెందుల రూరల్ మండల, సింహాద్రిపురంలో వేర్వేరుగా ప్రజాప్రతినిధులు, నాయకులు, అధికారులతో కలిసి పాడా అభివృద్ధి పనులపై సమీక్షా సమావేశాన్ని ముఖ్యమంత్రి నిర్వహించారు. ఆయా చోట్ల సిఎం జగన్ మాట్లాడుతూ పులివెందుల నియోజకవర్గ అభివృద్ధి, సంక్షేమ పథకాల అమలు కోసం అలుపెరగకుండా శ్రమిస్తున్న ప్రజాప్రతినిధులు, అధికారులు, నాయకులకు, ప్రభుత్వ ఆశయాల ఆచరణకు సంపూర్ణ సహకారం, మద్దతునిస్తున్న ప్రజలకు ధన్యవాదాలు తెలిపారు. రిజర్వాయర్ల పరిసర ప్రాంత గ్రామాల్లోని గ్రామస్థులకు, రైతులకు ఏవైనా సమస్యలను పూర్తి వివరాలతో అందజేస్తే సంబందిత అధికారులు త్వరితగతిన చర్యలు చేపట్టేందుకు చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు. సమావేశంలో జిల్లా ఇన్‌ఛార్జి మంత్రి ఆదిమూలపు సురేష్, కడప ఎంపీ అవినాష్‌రెడ్డి, రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు ధనుంజయ రెడ్డి, ఒఎస్‌డి కృష్ణమోహన్‌రెడ్డి, కలెక్టర్ వి.విజయ్ రామరాజు, జెసి గణేష్ కుమార్, పాడా ఓఎస్డీ అనిల్ కుమార్ రెడ్డి, ఆర్డీవో వెంకటేశ్వర్లు, ఫుడ్ ప్రాసెసింగ్ సలహా కమిటీ మెంబర్ బలరామిరెడ్డి, మండలధ్యక్షులు, ఎంపిటిసిలు ఖాదరబాధర వరలక్ష్మి, కొమ్మా వరలక్ష్మి, మార్కెట్ యార్డు వైస్ చైర్మన్ సర్వోత్తం రెడ్డి, పలువురు జిల్లా అధికారులు పాల్గొన్నారు.

సింహాద్రిపురం : పోలీస్‌స్టేషన్‌లో సంతకం చేస్తున్న వై.ఎస్. జగన్

వేంపల్లె : ప్రజాప్రతినిధులు, అధికారుల సమావేశంలో మాట్లాడుతున్న సిఎం

ముందస్తు క్రిస్మస్ వేడుకల్లో సిఎం

జిల్లా పర్యటనలో భాగంగా ఇడుపులపాయకు విచ్చేసిన ముఖ్యమంత్రి జగన్ మోహన్‌రెడ్డి ముందస్తు క్రిస్మస్ వేడుకల్లో పాల్గొన్నారు. ఇడుపులపాయ వ్యవసాయ క్షేత్రంలోని నెమళ్ల పార్కు సమీపంలో ఉన్న ప్రార్థన మందిరంలో తల్లి విజయమ్మ, సతీమణి వైఎస్ భారతిలతో పాటు కుటుంబ సభ్యులతో కలిసి ముఖ్యమంత్రి జగన్ క్రిస్మస్ వేడుకలకు చెందిన ప్రత్యేక ప్రార్థనలు చేశారు. దాదాపు రెండు గంటల వరకు కొనసాగిన క్రిస్మస్ ప్రత్యేక ప్రార్థనల్లో సిఎం పాల్గొన్నారు. ప్రత్యేక ప్రార్థనల్లో పాల్గొన్న కుటుంబ సభ్యులు, బంధువులతో సంతోషంగా సిఎం గడిపారు. బంధువులైన ప్రతి ఒక్కరికి పేరుతో సిఎం పలకరించి ఆప్యాయంగా ఆలింగనం చేసుకుని క్రిస్మస్ శుభాకాంక్షలు తెలిపారు. ముందస్తు క్రిస్మస్ వేడుకల్లో సిఎం తల్లి విజయమ్మ, సతీమణి వైఎస్ భారతి, ఎంపీ అవినాష్ రెడ్డి, వైఎస్ సుధీకర్ రెడ్డి, ఆర్టీసీ చైర్మన్ దుగ్గాయపల్లి మల్లిఖార్జున రెడ్డి, కమలాపురం ఎమ్మెల్యే రవీంద్రనాథ్ రెడ్డి, జిల్లా ఇన్‌ఛార్జి మంత్రి ఆదిమూలపు సురేష్, కడప మేయర్ సురేష్ బాబుతో పాటు సిఎం బంధువులు, ఎమ్మెల్యేలు నాయకులు, పాల్గొన్నారు.

రూ.36.02 కోట్ల అభివృద్ధి పనులకు ప్రారంభోత్సవాలు

సింహాద్రిపురంలో రూ.36..02 కోట్లతో పలు అభివృద్ధి పనులకు సిఎం జగన్ ప్రారంభోత్సవాలు చేశారు. నూతనంగా నిర్మించిన రోడ్డు వెడల్పు సుందరీకరణ పనులు, వైఎస్సార్ పార్క్, తహశీల్దార్ కార్యాలయం, పోలీస్ స్టేషన్, ఎంపిడిఒ కార్యాలయాలను ప్రారంభించారు. పాడా నిధులతో మండల కేంద్రంలో రూ.11.6 కోట్లతో నూతనంగా సుందరీకరరించిన రోడ్లు, జంక్షన్‌లను మొదట ముఖ్యమంత్రి ప్రారంభించారు. ఫోర్ లైన్ సిసి రోడ్, బి.టి రోడ్ జంక్షన్లు ఉన్నాయి. అనం తరం రూ 5.5 కోట్ల నిధులతో 1.5 ఎకరాల్లో సుందరంగా ఏర్పాటు చేసిన వైఎస్ఆర్ పార్కును ఆయన ప్రారంభించారు. ఎంట్రీలో ప్లాజా వాటర్ ఫౌం డేషన్, చిన్నపిల్లల ప్లే ఏరియా, ఓపెన్ జిమ్, వైఎస్ఆర్ విగ్ర హాలను అందంగా ఏర్పాటు చేశారు. అనంతరం రూ.3.19 కోట్ల పాడానిధులతో నిర్మించిన న్యూ తహశీల్దార్ ఆఫీస్ బిల్డింగ్‌ను, రూ.2 కోట్ల నిధులతో నిర్మించిన న్యూ పోలీస్ స్టేషన్‌ను, రూ 3.16 నిధులతో నిర్మించిన ఎంపిడిఒ ఆఫీసును ఆయన ప్రారంభించారు. కార్యక్రమంలో తహశీల్దార్ డి.మహబూబ్బాషా, ఎంపిడిఒ జి.కృష్ణమూర్తి, ఎస్ఐ రోషన్, పోలీస్ అధికారులు, నాయకులు పాల్గొన్నారు.

రెండో రోజూ ఇడుపులపాయలో సిఎం బస

సింహాద్రిపురం మండల కేంద్రంలో పలు ప్రారంభోత్సవ కార్యక్రమాలను ముగించుకుని సాయంత్రం 4.50 గంటలకు ఇడుపులపాయ హెలిప్యాడ్‌కు ముఖ్యమంత్రి జగన్ మోహన్‌రెడ్డి చేరుకున్నారు. నాయకులు, అధికారులు సిఎంకు స్వాగతం పలికారు. హెలిప్యాడ్ వద్ద ఉన్న వైసిపి నేతలను సిఎం పలకరించి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు.

'బాబు ష్యూరిటీ..భవిష్యత్తుకు గ్యారంటీ'

ప్రజాశక్తి-చెన్నూరు

మండల కన్వీనర్ కల్లూరు విజయభాస్కర్ రెడ్డి ఆధ్వర్యంలో ఆదివారం మండల కేంద్రంలోని సరస్వతి నగర్, లక్ష్మీనగర్‌లలో 'బాబు ష్యూరిటీ.. భవిష్యత్తుకు గ్యారంటీ' కార్యక్రమం నిర్వహించారు. చంద్రబాబు నాయుడు ప్రవేశపెట్టిన మినీ మేనిఫెస్టోను ప్రతి ఇంటికీ వెళ్లి వివరించారు. మొబైల్‌లో ఆన్‌లైన్ రిజిస్ట్రేషన్ చేశారు. కార్యక్రమంలో 71వ బూత్ ఇన్‌ఛార్జి జడ లక్ష్మీనారాయణ, 76వ బూతు ఇన్‌చార్జ్, అధికారి విశ్వం, మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ ఇంది రెడ్డి శివారెడ్డి, రామేటి పప్పు రాజు,టిడిపి పార్టీ అభిమానులు కార్యకర్తలు పాల్గొన్నారు.

ఉచిత వైద్య శిబిరానికి విశేష స్పందన

ప్రజాశక్తి - కడప

కడప నగరంలోని నబికోట్‌లో ఆదివారం గుల్ ఖాన్ వెల్ఫేర్ కమిటీ ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. ఈ ఉచిత వైద్య శిబిరంలో సుమారు 120 మంది ప్రజలు వైద్య పరీక్షలు చేయించుకున్నారు. డాక్టర్ సయ్యద్ సర్ఫరాజ్, డాక్టర్ మెహతాబ్ బేగం , డాక్టర్ ఫౌజియా బేగం, డాక్టర్ మహమ్మద్ సైఫుల్ల, డాక్టర్ అజాజ్ అహ్మద్ బృందం ప్రజలకు ఉచిత వైద్య పరీక్షలు నిర్వహించారు. అవసరమైన వారికి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వైద్య శిబిరాన్ని సందర్శించిన ఆంధ్రప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ మైనార్టీ విభాగపు ఉపాధ్యక్షుడు పఠాన్ మహమ్మద్ అలీ ఖాన్ మాట్లాడుతూ పేద ప్రజలకు ఇలాంటి ఉచిత వైద్యం అందించడం సంతోషదాయకమన్నారు. కార్యక్రమంలో గుల్ ఖాన్ వెల్ఫేర్ కమిటీ అధ్యక్షుడు డాక్టర్ ఎజాజ్ అహ్మద్ , ఉపాధ్యక్షుడు కరిముల్లా ఖాన్, కార్యదర్శి ఎస్. ఏ . అలీమ్ అసద్ , కోశాధికారి జిలాన్, సంయుక్త కార్యదర్శి అన్వర్ హుస్సేన్ పాల్గొన్నారు.

'రాబోయే ఎన్నికల్లో వైసిపి విజయం తథ్యం'

ప్రజాశక్తి-కలసపాడు

మాట్లాడుతున్న అంకన గురివిరెడ్డి

2024 ఎన్నికల్లో వైఎస్ఆర్‌సిపి అత్యధిక మెజార్టీతో విజయం సాధిస్తుందని మండల వైఎస్ఆర్‌సిపి ఇన్‌ఛార్జి అంకన గురివిరెడ్డి పేర్కొన్నారు. ఆదివారం ఆయన స్వగృహంలో పాత్రికేయులతో మాట్లాడుతూ జగన్మోహన్‌రెడ్డి ముఖ్యమంత్రి అయినప్పటి నుంచి మండలంలో అనేకమందికి అనేక విధాలుగా అన్ని రంగాలలో ఆదుకున్నారని తెలిపారు. అర్హత కలిగిన ప్రతి ఒక్కరికి పెన్షన్లు మంజూరు చేశామన్నారు. ఒక్కో సచివాలయానికి పరిధిలో 15 నుండి 20 కోట్ల వరకు ప్రజలకు లబ్ధి చేకూరిందని అన్నారు. రానున్న ఎన్నికల్లో మండలంలోని ప్రతి ఒక్క కార్యకర్తా సైనుకుడిలా పనిచేసి వైసిపి అభ్యర్థులు విజయానికి కృషి చేయాలని కోరారు.

మదరస నిర్మాణానికి ఆర్థిక సాయం

కడప అర్బన్ : మదరస, మసీదు నిర్మాణం కోసం టిడిపి మైనార్టీ నాయకులు వి.ఎస్. అమీర్ బాబు రూ.50వేలు ఆర్థిక సహాయం అందజేశారు. ఆదివారం నగరంలోని అగాడి వీధిలో నూతనంగా మదరస, మసీదు నిర్మాణం శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ముస్లిం మైనార్టీ పిల్లలందరూ చదువులో వెనుకబడి ఉన్నారని తెలిపారు. ముస్లిం మైనార్టీ పిల్లలందరూ బాగా చదివి ఉన్నతమైన స్థాయికి చేరుకోవాలని ఆకాంక్షించారు. చదువుకు మించిన ఆస్తి లేదని చెప్పారు. కార్యక్రమంలో మసీదు కమిటీ సభ్యులు, మతపెద్దలు పాల్గొన్నారు.

రూ.30 కోట్లతో ఎత్తిపోతల పనులు

- కలసపాడు ఎగువకు సాగర్ జలాలు
- కుందూ-పెన్నా ఎత్తిపోతలతో స్థిరీకరణ
- తెలుగుగంగ ప్రాజెక్ట్స్ సూపరింటెండెంట్ డి.వెంకటరామయ్య

బ్రహ్మసాగర్ ఎత్తిపోతల పనులు వేగవంతం చేస్తాం. రూ.46 కోట్లతో బ్రహ్మసాగర్ కెనాల్ గేట్ల మరమ్మతులు, ఎత్తిపోతల పనులను పూర్తి చేయడంపై దృష్టి సారించాం. 1.56 లక్షల పూర్తిస్థాయిలో ఆయ కట్టుకు నీరందించడమే ధ్యేయంగా ముందుకెళు తున్నాం. ఇందులోభాగంగా కుడి, ఎడమ కాల్వల పనుల్ని వేగవంతం చేశాం. ఎడమ కాల్వ పనుల్లో పురోగతి కనిపిస్తోంది. జిబిఒ, ఒబిసి పనుల్లో కదలిక నేపథ్యంపై సర్వత్రా ఆసక్తి నెలకొంది. నంద్యాల-కడప జిల్లా సరిహద్దు ప్రాం తంలోని 98 కి.మీ నుంచి 108 కి.మీ వరకు కాల్వల పనుల్ని పూర్తి చేస్తే పూర్తిస్థాయిలో ఆయకట్టుకు నీరందించే అవకాశాలు ఉంటాయని పేర్కొంటున్న తెలుగుగంగ ప్రాజెక్ట్స్ సూపరింటెండింగ్ ఆఫీసర్ ఇ.వెంకటరామయ్యతో ముఖాముఖి...

- ప్రజాశక్తి - కడప ప్రతినిధి

ముఖా ముఖి..

ఎత్తిపోతల వివరాలు తెలపండి?

బ్రహ్మంసాగర్ ఎడమ కాల్వ నుంచి రూ.30 కోట్ల వ్యయంతో తనుకు వాగు దగ్గర నుంచి ఎత్తిపోతల పథకం పనులకు టెండర్లు పిలిచాం. ఇప్పటికే మెయిన్‌ఫైప్‌లైన్ పనులకు టెండర్ల ప్రక్రియను పూర్తి చేశాం. ఎత్తిపోతల పథకం పనుల కారణంగా కలసపాడు, కాశినాయన మండలాల్లోని ఎగువ ప్రాంతాలకు తాగు, సాగునీటిని అందించే అవకాశం ఉంది.

సాగర్ నిల్వ సామర్థ్యం ఎంత?

17 టిఎంసిల నిల్వ సామర్థ్యాన్ని కలిగి ఉంది. ప్రస్తుతం 5.8 టిఎంసిలు నిల్వ ఉంది. కుందూ-పెన్నా ఎత్తిపోతల పథకం పూర్తి చేస్తే ఆయకట్టు పూర్తిస్థాయిలో స్థిరీకరణకు అవకాశం ఉంటుంది.

కెనాల్ లీకేజీ గురించి చెప్పండి?

బ్రహ్మంసాగర్ కుడి, ఎడమ కాల్వల నుంచి నీరు లీకేజీ కొనసాగుతోంది. ఒక కెనాల్ గేజ్‌లకు మరమ్మతులకు గురికావడం, మరో కెనాల్‌లో డ్రమ్స్‌ల సర్దుబాటులో స్తబ్ధత కారణంగా లీకేజీ కొనసాగుతోంది. దీనిపై నాలుగుసార్లు టెండర్లు పిలిచాం. కాంట్రాక్టర్లు ముందుకు రావడం లేదు. దీంతో ఇటీవల తాత్కాలికంగా ఎల్ఎస్‌పి కాంట్రాక్టర్‌తో కదిలించే ప్రక్రియ చేపట్టాం. కొంతవరకు ఉపశమనం కనిపించింది. పూర్తిస్థాయిలో మరమ్మతులకు టెండర్లు పిలవడమైంది.

సాగర్ ఆయకట్టు విస్తీర్ణమెంత?

బ్రహ్మంసాగర్ కింద 1.56 లక్షల విస్తీర్ణం ఉంది. ఇందులో 40 వేల ఎకరాలకు సాగునీరు అందిస్తున్నాం. మిగిలిన ఆయకట్టు ఎస్ ఆర్-1, ఎస్ఆర్-2 రిజర్వాయర్లు, ఎడమ, కుడి కాల్వల పరిధిలో ఉంది. ఇందులో జిబిసి, ఓబిసి కెనాల్ ప్రాంతాల్లో పెండింగ్ పనుల్ని పూర్తి చేయ డంపై ఆధారపడి ఉంది.

సాగర్ ఆయకట్టు వివరాలు తెలపండి?

బద్వేల్, మైదుకూరు నియోజకవర్గాల పరిధిలోని 11 మండలాల్లో బ్రహ్మంసాగర్ ఆయకట్టు విస్తరించింది. మైదుకూరు నియోజకవర్గ పరిధిలోని మైదుకూరు, దువ్వూరు, ఖాజీపేట, బద్వేల్ నియోజకవర్గంలోని బద్వేల్, పోరుమామిళ్ల, కలసపాడు, బి.కోడూరు, గోపవరం, అట్లూరు మండలాలున్నాయి.

పెండింగ్ పనుల పురోగతి ఎలా ఉంది?

బ్రహ్మంసాగర్ కుడి, ఎడమ కాల్వల్లోని జిబిసి, ఓబిసి ప్రాంతా ల్లోని అక్కడక్కడా ఉన్న పెండింగ్ పనులు వేగవంతం చేశాం. ఇందులో భాగంగా ఓబిసి ప్రాంతాల్లోని పెండింగ్ పనుల్ని చేపట్టడానికి కాంట్రాక్టర్ ముందుకు రావడంతో పనులు పట్టాలకు ఎక్కించాం. జిబిసి కాంట్రాక్టర్ ముందుకెస్తే 50 వేల ఎకరాల ఆయ కట్టుకు నీరందించే అవకాశం ఉంది. ఇందులోభాగంగా జిబిసి కింద 20 వేల ఎకరాలు, ఓబిసి కెనాల్ ప్రా ంతంలో 10 వేల ఎకరాలు వెరసి 30 వేల ఎకరాల ఆయకట్టు అందుబాటులోకి రానుంది.

లైనింగ్ పనుల పరిస్థితి ఏమిటి?

బ్రహ్మంసాగర్ కుడి కాల్వ 15 కిలోమీటర్లు, ఎడమ కాల్వ 58 కిలోమీటర్ల మేర విస్తరించి ఉంది. రూ.9.7 కోట్లతో ఎడమ కాల్వ లైనింగ్ పనుల్లో 50 శాతం పురోగతి కొనసాగుతోంది. నాలుగు దఫాలుగా పిలిచిన టెండర్లలో జెకె కన్స్ట్రక్షన్ కంపెనీ కాంట్రాక్టును దక్కించుకుని పనులు చేపడుతోంది. రూ.10 కోట్లతో కుడి కాల్వ పనులు చేపట్టాల్సి ఉంది. ఇందులో 700 మీటర్ల అక్విడక్టు పనులు చేపడితే అట్లూరు మండలంలో ని ఆయకట్టుకు నీరందించే అవకాశం ఉంది.

లీకేజీ మరమ్మతు ఎంతవరకు వచ్చింది?

బ్రహ్మంసాగర్ లీకేజీ పనులకు రూ.57 కోట్లతో ప్రతిపాదనలు పంపించాం. లీకేజీ ప్రాంతాల్లో 36 ఫిల్లర్లను ఏర్పాటు చేయడమైంది. ఇక్కడి నుంచి ముందుకు వెళ్లడానికి పోలవరం అథారిటీ నిపుణుల నుంచి అందే సూచనలు, సలహాలను బట్టి ముందుకు వెళతాం. దీంతోపాటు మరో 100 మీటర్లలో చెమ్మ తగిలిన ప్రాంతాన్నీ గుర్తించడమైంది. గ్రౌటింగ్ ప్రక్రియ సహాయంతో చెమ్మను అరికట్టే ప్రయత్నాలు చేపట్టాల్సి ఉంది.

కుందూ-పెన్నా లిఫ్టు పనుల గురించి చెప్పండి?

కుందూ-పెన్నా ఎత్తిపోతల పనులు పురోగతిలో ఉన్నాయి. 56 ఎకరాల భూసేకరణ అనంతరం ఎత్తిపోతల పనులు ఊపందుకునే అవకాశం ఉంది. లిఫ్టు పనులను పూర్తి చేసిన అనంతరం ఎనిమిది టిఎంసి లను ఎత్తిపోసే అవకాశం ఉంది.

సర్‌ప్లస్ గేట్ ఏర్పాటు ఎప్పుడు?

బ్రహ్మంసాగర్ సరప్లస్ గేట్ సెంట్రల్ డిజైనింగ్ ఆఫీసర్స్ సర్వే చేసి ప్రతిపాదనలు పంపించాం. డ్రాయింగ్ సెక్షన్ నుంచి అప్రూవల్ లభించాల్సి ఉంది.

ప్రజలను మోసగించిన సిఎం జగన్ : టిడిపి

కడప అర్బన్ : వైసిపి అధికారంలోకి వచ్చినప్పటి నుంచి ఇప్పటివరకు ప్రజలను వంచించి పాలన సాగించిందని టిడిపి పొలిట్ బ్యూరో సభ్యులు శ్రీనివాసరెడ్డి ధ్వజమెత్తారు. ద్వారకా నగర్‌లోని ఆయన నివాసంలో ఆదివారం విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ముఖ్యమంత్రిగా జగన్ అభివృద్ధికి ఎన్ని శిలాఫలకాలు వేశారని, ఒక్క అభివృద్ధి పనులు చేశారా అని 10 నియో జకవర్గాల ఎమ్మెల్యేలను ప్రశ్నించారు. ఎమ్మెల్యేలుగా ఉండి అభివృద్ధి చేయలేనప్పుడు, ఓట్లు వేసి గెలిపించిన ప్రజలకు అభివృద్ధి చేయలేకపోయామని క్షమాపణలు చెప్పి రాజీ నామాలు చేయాలన్నారు. ప్రభుత్వంలో క్రిస్మస్, సంక్రాంతి కానుకలు లేవని పేర్కొన్నారు. నూటికి నూరు శాతం ప్రజలు టిడిపి పాలనను కోరుకుంటున్నారని అన్నారు.

సమాజ అవసరం.. ఈశ్వరరెడ్డి అక్షరం : విసి

కడప అర్బన్ : సమాజ అవసరాలపై కలం కదిపి ప్రజల వైపు నిలబడే రచయిత ఆచార్య ఈశ్వరరెడ్డి అని వైవీయూ విసి ఆచార్య చింత సుధాకర్ అన్నారు. సూర్య నారాయణ ఛారిటబుల్ ట్రస్ట్ రాయలసీమ టూరిజం అండ్ కల్చరల్ సొసైటీ, అభ్యుదయ రచయితల సంఘం సంయుక్త ఆధ్వర్యంలో ఆచార్య ఎన్.ఈశ్వరరెడ్డి రచించిన 'నాలో నువ్వు (కవిత్వం)', 'సాహిత్యంలో సమాజం (విమర్శ)' పుస్తకాల ఆవిష్కరణ సభ ఆదివారం సి.పి.బ్రౌన్ గ్రంథాలయంలో నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన విసి మాట్లాడుతూ రచయిత ఈశ్వరరెడ్డిలో క్రమశిక్షణ, కష్టపడేతత్వం కనిపిస్తుందన్నారు. 'నాలోనువ్వు' పుస్తకం కొంత చదివానని దాని పరమార్థం తెలిసిందన్నారు. సభాధ్యక్షులు వెంకటేశ్వర విశ్వవిద్యాలయ ప్రాశ్చ్య పరిశోధన సంస్థ సంచాలకులు ఆచార్య పి.సి. వెంకటేశ్వర్లు అధ్యక్షోపన్యాసం చేస్తూ ఆచార్య ఈశ్వరరెడ్డి లోతైన అధ్యయనం చేయగల గొప్ప రచయిత అన్నారు. ఆత్మీయ అతిథి ఇంటాక్ కడప చాప్టర్ లయన్ చిన్నపరెడ్డి మాట్లాడుతూ రచయితను అభినందిస్తూ పదివేల విలువ చేసే పుస్తకాలు తాను కొనుగోలు చేసి పంపిణీ చేస్తామన్నారు. 'నాలో నీవు ' పుస్తకాన్ని బండి ఆనందరెడ్డి, నందనూరు సుగాత్రి దంపతులు అందుకున్నారు. అరసం కడప జిల్లా ఉపాధ్యక్షులు డాక్టర్. ఎస్.రాజగోపాల్ రెడ్డి సభా సమన్వయం చేశారు. కడప జిల్లా అభ్యుదయ రచయితల సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి డాక్టర్. తుమ్మ లూరు సురేష్ బాబు వందన సమర్పణ చేశారు. కార్యక్రమంలో సూర్య ఛారిటబుల్ ట్రస్టు అధ్యక్షులు ఎం. ప్రభాకర్ నాయక్, రాయలసీమ టూరిజం అండ్ కల్చరల్ సొసైటీ ప్రధాన కార్యదర్శి కొండూరు జనార్ధ నరాజు,ఆచార్య తప్పెట రామప్రసారెడ్డి, సాహితీవేత్తలు,విద్యార్థులు పాల్గొన్నారు.

ముగిసిన జిల్లా రచయితల సంఘం మహాసభలు

కడప అర్బన్ : వైఎస్ఆర్ జిల్లా రచయితల సంఘం ఆధ్వర్యంలో పట్టణంలోని జిల్లా పరిషత్ సభాభవనంలో ఏర్పాటు చేసిన రెండురోజుల మహాసభల్లో భాగంగా ఆదివారం సదస్సులు, అవధానుల స్వీయానుభవాలు, కవిసమ్మేళనాలతో ఘనంగా ముగిశాయి. కార్యక్రమంలో డాక్టర్ భూతపురి సుబ్రహ్మణ్య శర్మ సభావేదికపై నిర్వహించిన సదస్సుకు ప్రముఖ కథారచయిత డాక్టర్ కొమ్మిశెట్టి మోహన్ అధ్యక్షత వహించారు. ప్రముఖ కథారచయిత దాదాహయాత్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. 'వైఎస్ఆర్ జిల్లా ఆధునిక పద్యకవిత్వం' అనే అంశంపై డాక్టర్ నరాల రామారెడ్డి, ' జిల్లా అవధానులు' అనే అంశంపై ఆముదాల మురళి, 'వైఎస్ఆర్ జిల్లా పత్రికారంగం' అనే అంశంపై డాక్టర్ తుమ్మలూరు సురేష్ బాబు, 'వైఎస్ఆర్ జిల్లా సాహిత్య విమర్శ' అనే అంశంపై డాక్టర్ ఎన్. విజయ భాస్కర్ పత్ర సమర్పణ చేశారు. అనంతరం అవధానుల స్వీయా నుభవాలు సదస్సు నిర్వహించారు. వైఎస్ఆర్ జిల్లా రచయి తల సంఘం ఉపాధ్యక్షులు డాక్టర్ గానుగపెంట హనుమంతరావు అధ్యక్షత వహించారు. కేంద్ర సాహిత్య అకాడమీ పురస్కార గ్రహీత డి. కె. చదు వులబాబు ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. రాచమల్లు రామచంద్రారెడ్డి సభావేదికపై నిర్వహించిన కవిసమ్మేళనానికి ముఖ్య అతిథిగా లయన్స్ క్లబ్ ఆఫ్ కడప అన్నమయ్య అధ్యక్షులు పోతుల వెంకట్రామిరెడ్డి హాజరయ్యారు. ముగింపు సమావేశానికి వైఎస్ఆర్ జిల్లా రచయితల సంఘం గౌరవాధ్యక్షులు షేక్. హుస్సేన్ సత్యాగ్ని అధ్యక్షత వహించారు. ముఖ్య అతిథిగా ప్రముఖ ఆడిటర్ లయన్ పి.ఖాసింఖాన్ పాల్గొన్నారు. వైఎస్ఆర్ జిల్లా రచయితల సంఘం అధ్యక్షులు ఆచార్య మూల మల్లికార్జునరెడ్డి సమాపన ప్రసంగం చేశారు.

పూల తోటలను పరిశీలిస్తున్న తిరుపాల్‌రెడ్డి

పూల రైతులను ఆదుకోవాలి : కాంగ్రెస్

ప్రజాశక్తి - పులివెందుల టౌన్

నష్టాల బాటలో పయనిస్తున్న పూల రైతులను ప్రభుత్వం ఆదుకోవాలని కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ సమన్వయ కమిటీ సభ్యుడు కేతిరెడ్డి తిరుపాల్‌రెడ్డి కోరారు. పులివెందుల ప్రాంతంలో సాగవుతున్న పూల తోటలను ఆదివారం ఆయన పరిశీలించారు. పూలసాగు, పెట్టుబడి, దిగుబడి, రాబడి వంటి అంశాల గురించి రైతులను అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ప్రతి ఏటా అక్టోబర్ నుంచి పూలసాగు చేయడం రైతులకు అలవాటు అన్నారు. ఆహార, వాణిజ్య, వ్యాపార, ఉద్యాన పంటలతోపాటు పూదోటలు సాగు చేస్తారన్నారు. ప్రస్తుత మార్కెట్ ప్రకారం ధర చూస్తే ఏమాత్రం గిట్టుబాటు కాలేదని రైతులు పేర్కొన్నట్లు తిరుపాల్‌రెడ్డి వివరించారు. ఎన్నో ఆశలు నింపుకొని సాగుచేసిన పూల రైతులకు పూర్తిస్థాయిలో పరిహారం అందించాలన్నారు.అంతేకాక సాగుకు ఉచితంగా విత్తనాలు, ఎరువులు అందజేయాలని కోరారు. రానున్న ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రాగానే ఆరు సూత్రాలు అమల్లో ఒకటైన రుణమాఫీ అందించి రైతులకు అండగా నిలుస్తామని తిరుపాల్‌రెడ్డి పేర్కొన్నారు.

ఎస్‌టియు నూతన కార్యవర్గం ఏర్పాటు

ప్రజాశక్తి - ఖాజీపేట

కడప నగరంలోని ఎస్‌టియు సభ భవనంలో ఆదివారం నూతన కార్యవర్గ సమావేశం నిర్వహించారు. కార్యక్రమంలో జరిగిన ఎన్నికల్లో ఎస్‌టియు ఖాజీపేట మండలశాఖ నూతన అధ్యక్ష, ప్రధాన కార్య దర్శులుగా షేక్ కరిముల్లా, ఎం.శ్రీనివాసులు, ఆర్థిక కార్యదర్శిగా జె.సుబ్బారెడ్డి, జిల్లా కౌన్సిలర్లుగా పత్తూరు ఓబన్న, నాచిరాజు సుమన్, సి.పద్మ, ఎ.మధురవాణి, పెంచల య్య, జి. వెసుబ్బారెడ్డి ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా యూనియన్ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు రమణారెడ్డి, వెంకటసుబ్బయ్య మాట్లాడుతూ విద్య, ఉపాధ్యాయ రంగ సమస్యల పరిష్కారం కోసం ఎస్‌టియు ఎల్లప్పుడూ కృషి చేస్తుందన్నారు. కార్యక్రమములో ఎస్‌టియు సీనియర్ నాయ కులు బాల గంగిరెడ్డి, ఇలియాస్ బాషా, గోశెట్టి రామమోహన్ పాల్గొన్నారు


సన్మాన కార్యక్రమంలో ఎస్‌టియు నాయకులు

రోగులకు సేవలు చేయడంలోనే సంతృప్తి

ప్రజాశక్తి - వేంపల్లె

రోగులకు వైద్య సేవలు చేయడం ద్వారా సంతృప్తి చెందుతుందని ఆల్ అమిన్ సొసైటీ అధ్యక్షుడు డాక్టర్ ఎస్ఎఫ్ బాషా అన్నారు. ఆదివారం స్థానిక గండి రోడ్డులో డాక్టర్ ఎస్ఎఫ్ బాషా హాస్పిటల్ ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరం ఏర్పాటు చేశారు. ఈ వైద్య శిబిరంలో రోగులకు కడపకు చెందిన సూపర్ స్పెషాలిటీ వైద్యులతో వైద్య పరీక్షలు చేశారు. ఉచిత వైద్య శిబిరానికి రోగుల నుండి విశేష స్పందన లభించింది. రోగులకు వైద్య సేవలు అందించాలనే ఉద్దేశంతో ఆల్ అమీన్ సొసైటీ ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేసినట్లు చెప్పారు. ఆరోగ్యం పట్ల ప్రతి ఒక్కరూ శ్రద్ధ పెట్టాలని కోరారు. కార్యక్రమంలో స్పెషలిస్ట్ డాక్టర్లు క్రిష్ణ కార్తీక్‌రెడ్డి, దినేష్‌రెడ్డి, పవన్‌కుమార్‌రెడ్డి, హాస్పిటల్ సిబ్బంది పాల్గొన్నారు.

పరుగు పందెం పోటీలో పాల్గొన్న విద్యార్థులు

జిల్లా స్థాయి అథ్లెటిక్స్ పోటీలు విజయవంతం

ప్రజాశక్తి - ప్రొద్దుటూరు

బాషా అథ్లెటిక్స్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఆదివారం స్థానిక అనిబి సెంట్ మున్సిపల్ ఉన్నత పాఠశాలలో నిర్వహిం చిన అథ్లెటిక్స్ పోటీలు విజయ వంతమ య్యాయి. జిల్లా నలుమూలల నుండి 14, 16 ఏళ్లలోపు బాల బాలికలు 300 మంది హాజరయ్యారు. 60 మీటర్లు, 600 మీటర్లు, హై జంప్, బ్రాడ్ జంప్, కిడ్స్ జావలి, షార్ట్‌పుట్ క్రీడాంశాలు నిర్వహించారు. కడప నుండి శ్రీలతరెడ్డి, సాయి అన్వేష్, శ్రీనివాస్, తేజేశ్వర్‌రెడ్డి, బి.సాయి.. ప్రొద్దుటూరు నుండి వీరభవ్యసాయిరెడ్డి, గురుదేవ.. తాళ్లమాపురం నుండి శశికళ.. బద్వేల్ నుండి కౌశిక గెలుపొందారు. వీరు కడప జిల్లా తరపున వచ్చే ఏడాది ఫిబ్రవరి 24న గుజరాత్‌లో జరగబోయే నేషనల్ ఇంటర్ డిస్ట్రిక్ట్ జూనియర్ అథ్లెటిక్స్ పో టీలలో పాల్గొనాల్సి ఉంటుందని ఫౌండేషన్ కార్యదర్శి అహ్మర్‌బాషా తెలిపారు.

అలరించిన చిన్నారుల నృత్యాలు

ప్రజాశక్తి - పులివెందుల టౌన్

పట్టణంలోని శిల్పారామంలో ఆదివారం సాయంత్రం చిన్నారులు ప్రదర్శించిన నృత్యాలు అందరినీ అలరించాయి. శ్రీ సూర్య డాన్స్ అకాడమీ మదనపల్లె వారి చిన్నారులు నృత్యాలు చేశారు. కార్యక్రమంలో శిల్పారామం పరిపాలన అధికారి సుధాకర్, డ్యాన్స్ మాస్టర్ సూర్య పాల్గొన్నారు.

6 నుంచి జిల్లా రైతు సంఘం మహాసభలు

ప్రజాశక్తి - ఎర్రగుంట్ల

ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం ఎర్రగుంట్ల మండల సమితి ఆధ్వర్యంలో జనవరి 6, 7వ తేదీల్లో ఎర్రగుంట్లలో రైతు సంఘం జిల్లా 19వ మహాసభలు నిర్వహించనున్నారు. ఆ మేరకు ఆదివారం కరపత్రాలను విడుదల చేశారు. ఈ సందర్భంగా రైతు సంఘం జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు ఎంవి సుబ్బారెడ్డి, పోతిరెడ్డి భాస్కర్ మాట్లాడుతూ రైతులు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించేలా మహాసభలు వేదిక కానున్నాయని తెలిపారు. పెండింగ్‌లో ఉన్న సాగునీటి ప్రాజెక్టుల సాధనకు, రైతుల పొలాల్లో పంట కాలువలు నిర్మించి సాగునీరు అందేలా చర్యలు చేపట్టాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో కాంగ్రెస్ కిసాన్ సెల్ జిల్లా అధ్యక్షులు ఇల్లూరు కృష్ణారెడ్డి, ఆంధ్రప్రదేశ్ ప్రజానాట్య మండలి జిల్లా అధ్యక్షులు సానబోయిన రమేష్, సిపిఐ మండల కార్యదర్శి జి భవానిశంకర్, సిపిఐ సీనియర్ నాయకులు టిసి ఓబుల్‌రెడ్డి, భవన నిర్మాణ కార్మిక సంఘం జిల్లా ఆర్గనైజింగ్ కార్యదర్శి సాకే రాధాకృష్ణ, నాయకులు పాల్గొన్నారు.

మహిళల ఆర్థిక ఎదుగుదలకు పథకాలు

ప్రజాశక్తి - చాపాడు

మహిళలు స్వయంగా ఆర్థిక ఎదుగుదలకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పలు పథకాలను అంది స్తున్నాయని ఇఒపిఆర్‌డి రాధాకృష్ణవేణి తెలిపారు. వీటిపై అవగాహన కార్యక్రమాన్ని ఆదివారం మండల పరిధిలోని చిన్నగురువలూరు, కుచ్చుపాప గ్రామాల్లో ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ వ్యవసాయానికి డ్రోన్‌లు, గృహాలకు గ్యాస్ సబ్సిడీలు వంటి అవకాశాలు ఉన్నాయని తెలిపారు. వీటిని సద్వినియోగం చేసుకోవాలని ఆమె సూచించారు. కార్యక్రమంలో మండలస్థాయి అధికారులు, గ్యాస్ ఏజెన్సీ నిర్వా హకులు, గ్రామ నాయకులు, సచివాలయ సిబ్బంది, ప్రజలు పాల్గొన్నారు.

అవగాహన కల్పిస్తున్న ఇఒపిఆర్‌డి రాధాకృష్ణవేణి

కుందూలో పేరుకుపోతున్న వ్యర్థాలు

ప్రజాశక్తి - చాపాడు

మండల పరిధిలోని కుందూనది, గోడేరు వంక ప్రాంతాల్లో వ్యర్థ పదార్థాలు అధికమవుతున్నాయి. స్థానికులతోపాటు, మైదుకూరు, ప్రొద్దుటూరు ప్రాంతాలకు చెందిన దుకాణదారులు వారి వ్యర్థాలను కుందూ నదిలో పడేస్తున్నారు. ముఖ్యంగా మైదుకూరు, ప్రొద్దుటూరు ప్రధాన రహదారిపై పెద్ద బ్రిడ్జి సమీపంలో, సీతారామాపురం గ్రామం వద్ద నదిలో వ్యర్థపదార్థాలు పడేస్తున్నారు. కొన్ని పదార్థాలు నీటిలో వేయడంతో అవి ఒడ్డుకు చేరుతున్నాయి. పెద్ద బ్రిడ్జి సమీపంలో వివిధ పదార్థాలు పడేస్తుండడంతో దుర్వాసన వస్తోంది. ముఖ్యంగా చికెన్ షాపుల వారు చనిపోయిన కోళ్లు, వ్యర్థపదార్థాలను పడేస్తున్నారు. సీతారాంపురం గ్రామం వద్ద అధిక వ్యర్థ పదార్థాలు నదిలో కనిపిస్తున్నాయి. ఇప్పటికైనా అధికారులు స్పందించి వ్యర్థపదార్థాలు నదిలో వేసే వారిని గుర్తించి తగు చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

సీతారామపురం వద్ద కుందూ నదిలో పడేసిన వ్యర్థ పదార్థాలు

'సీమ'కు అన్యాయం చేయడం సిఎంకు భావ్యమా!

- పిసిసి మీడియా ఛైర్మన్ తులసిరెడ్డి

ప్రజాశక్తి - వేంపల్లె

రాయలసీమ వాసిగా ఉంటూ సిఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి రాయలసీమకు అన్యాయం చేయడం భావ్యం కాదని పిసిసి మీడియా ఛైర్మన్ డాక్టర్ నర్రెడ్డి తులసిరెడ్డి పేర్కొన్నారు. ఆదివారం వేంపల్లెలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ రాయలసీమ ప్రాంత రైతులు, అన్ని వర్గాల ప్రజల సమగ్రాభివృద్ధి కోసం 2008-09లో రైల్వే బడ్జెట్‌లో నాటి రాష్ట్రంలోని కాంగ్రెస్ నేతృత్వంలోని యుపిఎ ప్రభుత్వం కడప-రాయచోటి-మదనపల్లె-బెంగళూరు నూతన బ్రాడ్ గేజ్ రైల్వే మంజూరు చేసిందని చెప్పారు. దీని పొడవు 255.40 కిలో మీటర్ల దూరమన్నారు. ప్రాజెక్టు అంచనా వ్యయం రూ.3,038 కోట్లు అన్నారు. నిధుల్లో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చేరి సగం నిధులు భరించేలా రైల్వేలైన్ మంజూరైనట్లు తెలిపారు. 2010 సెప్టెంబర్‌లో అప్పటి రైల్వే మంత్రి మునియప్ప పనులకు శంకుస్థాపన చేశారన్నారు. కడప నుంచి పెండ్లిమర్రి వరకు 21.80 కిలో మీటర్ల పని పూర్తయినట్లు తెలిపారు. రూ.351 కోట్లు ఖర్చు అయినట్లు చెప్పారు. రాష్ట్ర ప్రభుత్వం వాటాగా రూ.132.39 కోట్లు చెల్లించిందని వివరించారు. దురదృష్టవశాత్తు జగన్ ముఖ్యమంత్రి కావడంతో రాష్ట్ర ప్రభుత్వం వాటాను ఒక్క రూపాయి కూడా చెల్లించలేదని, ఈ నేపథ్యంలో రైలు పనులు ఆగిపోయినట్లు చెప్పారు. జగన్ ప్రభుత్వం అసమర్థతకు ఇది ఒక నిదర్శనమని విమర్శించారు. రాష్ట్ర ప్రభుత్వం వాటాగా చెల్లించాల్సిన నిధులను విడుదల చేసి రైల్వే శాఖ పనులు ప్రారంభించేలా చర్యలు తీసుకోవాలని తులసిరెడ్డి ప్రభుత్వాన్ని కోరారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వస్తే వెంటనే రాష్ట్ర ప్రభుత్వం వాటా నిధులను విడుదల చేసి రైల్వే పనులు ప్రారంభిస్తామని తులసిరెడ్డి అన్నారు.

12వ పిఆర్‌సి, ఐఆర్ వెంటనే ప్రకటించాలి

మాట్లాడుతున్న ఎస్‌టియు మండలశాఖ అధ్యక్షులు లక్ష్మీనరసింహ

ప్రజాశక్తి - వేంపల్లె

రాష్ట్ర ప్రభుత్వం ఉద్యోగులకు 12వ పిఆర్‌సి, ఐఆర్‌ను వెంటనే ప్రకటించాలని ఎస్‌టియు మండల శాఖ అధ్యక్షుడు లక్ష్మీనరసింహ డిమాండ్ చేశారు. స్థానిక ఎస్‌టియు ప్రాంతీయ కార్యాలయంలో ఆదివారం యూనియన్ ముఖ్య నాయకుల కార్యవర్గ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా లక్ష్మీనరసింహ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం 12వ వేతన సవరణ కమిషనర్‌ను నియమించి 5 నెలలు కావస్తున్నా.. ఇంతవరకు మధ్యంతర భతి(ఐఆర్)ని ప్రకటించకపోవడం శోచనీయమన్నారు. ఐఆర్ ప్రకటించికపోవడం వల్ల ఉద్యోగ, ఉపాధ్యాయ వర్గాలు ఆందోళనలో ఉన్నా యన్నారు. పిఆర్‌సి కమిషనర్ మన్మోహన్ సింగ్‌కు సహాయక ఉద్యోగులను ప్రభుత్వం నియమించక పోవడం దారుణమన్నారు. ముడు నెలల్లో ఎన్నికలు సమీపిస్తున్నప్పటికీ ప్రభుత్వ ఉద్యోగ, ఉపాధ్యాయులకు మేలు జరిగేలా ప్రభుత్వం ఐఆర్‌ను ప్రకటించాల్సిన అవసరం ఉందన్నారు. 11వ పిఆర్‌సి ఉద్యోగ, ఉపాధ్యాయులకు ఒక పీడ కలగా మిగిలిందని తెలిపారు. కనీసం 12వ పిఆర్‌సినైనా వైసిపి ప్రభుత్వం ఉద్యోగ, ఉపాధ్యాయులకు న్యాయం చేయాలని కోరారు. ఏడాదిగా పెండింగ్‌లో ఉన్న ఎపిజిఎల్ రుణాలు, ఫైనల్ పేమెంట్, పిఎఫ్ క్లియర్ చేయాలని కోరారు. సమావేశంలో ఎస్‌టియు సీనియర్ నాయకులు నరసింహారెడ్డి, రంగారెడ్డి, సంగమేశ్వర్‌రెడ్డి, శివారెడ్డి, ప్రతాప్‌రెడ్డి, రీజినల్ కన్వీనర్ ధర్మారెడ్డి, చప్పిడి శ్రీనివాసరెడ్డి, చక్రాయపేట మండలశాఖ అధ్యక్షులు జనార్దన్‌రెడ్డి, వేంపల్లి ప్రధాన కార్యదర్శి భాస్కర్‌రెడ్డి, ఆర్థిక కార్యదర్శి మహబూబ్ బాషా పాల్గొన్నారు.

చక్రాయపేట : రాష్ట్ర ప్రభుత్వం 12వ వేతన సవరణ కమిషనర్‌ను నియమించి ఐదు నెలలు కావస్తున్నా ఇంతవరకు మధ్యంతర భతి(ఐఆర్) ప్రకటించకపోవడంతో ఉద్యోగ, ఉపాధ్యాయ వర్గాల్లో ఆందోళన వ్యక్తమవుతోందని మండల ఎస్‌టియు మండలశాఖ అధ్యక్షుడు జనార్దన్‌రెడ్డి పేర్కొన్నారు. మూడు నెలల్లో ఎన్నికలు సమీపిస్తున్నప్పటికీ ప్రభుత్వ ఉద్యోగ, ఉపాధ్యాయుల పక్షాన వారికి మంచి జరిగేలా ప్రభుత్వం ఐఆర్ ప్రకటించాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. సమావేశంలో ఎస్‌టియు సీనియర్ నాయకులు నర్సింహారెడ్డి, రంగారెడ్డి, సంగమేశ్వర్ రెడ్డి, శివారెడ్డి, రీజియన్ కన్వీనర్ ధర్మారెడ్డి, చప్పిడి శ్రీనివాస్‌రెడ్డి, వేంపల్లి మండల శాఖ నాయకులు పాల్గొన్నారు.

పౌరుల సమగ్ర వికాసానికి కృషి : జెవివి

ప్రజాశక్తి - చక్రాయపేట

జన విజ్ఞాన వేదిక నిర్వహించిన మండలస్థాయి చెకుముకి సంబరాల టాలెంట్ టెస్టులో గండి గురుకుల పాఠశాల విద్యార్థుల జట్టు మొదటిస్థానంలో నిలిచింది. దేవ కార్తీక్, జస్వంత్, నాగ నరసింహ.. 2వ బహుమతి పొందిన సురభి ఉన్నత పాఠశాల విద్యార్థులు వైష్ణవి, మోక్షజ్ఞ, జశ్వంత్, 3వ బహుమతి సాధించిన మహదేవపల్లి ఉన్నత పాఠశాల విద్యార్థుల జట్టు నిఖిత, చంద్రిక, గంగాహసిని. జనవిజ్ఞాన వేదిక జిల్లా కార్యవర్గ సభ్యులు, రాష్ట్రపతి అవార్డు గ్రహీత గంగాధర్‌రెడ్డి మాట్లాడుతూ జెవివి ఆవిర్భావం నుండి శాస్త్ర సాంకేతిక అభివృద్ధికి కృషి చేసేందుకే పరిమితం కాకుండా పౌరుల సమగ్ర వికాసానికి విద్య, ఆరోగ్యం, పర్యావరణ, వ్యవసాయ, కూల్‌డ్రింక్ వ్యతిరేక ప్రచారం, దేశభక్తి, మూఢనమ్మకాలకు వ్యతిరేకంగా కళాజాతా, సైన్సు సంబరాలు, జీవవైవిధ్యం, భ్రూణ హత్యలు, బాలికా సంరక్షణ, మహిళా సాధికారతపై కార్యక్రమాలు, వేసవి శిక్షణ శిబిరాలు అన్నీ ప్రాంతాలలోని పాఠశాలలు కళాశాలలో విద్య వైజ్ఞానిక కార్యక్రమాలు నిర్వహిస్తుందని తెలిపారు. పాఠశాల విద్యార్థులకు చెకుముకి సంబరాలు నిర్వహిస్తున్నామని తెలిపారు.

బహుమతులతో విద్యార్థులు, జెవివి నాయకులు

'పేద ప్రజలకు సేవ చేయడమే లక్ష్యం'

సేవలు అందించిన విద్యార్థులకు మెమొంటోలను అందజేసిన చక్రపాణిరెడ్డి

ప్రజాశక్తి - వేంపల్లె

నిరుపేద ప్రజలకు సేవ చేయడమే మానవత స్వచ్ఛంద సేవా సంస్థ లక్ష్యమని మానవత సేవా సంస్థ ఛైర్మన్ చక్రపాణిరెడ్డి పేర్కొన్నారు. ఆదివారం శ్రీచైతన్య పాఠశాల ఆవరణంలో మానవత స్వచ్ఛంద సేవా సంస్థ మండల శాఖ ఆధ్వర్యంలో మోహన్ డయాబిటీస్ స్పెషలిస్ట్ సెంటర్ సహకారంతో ఉచిత వైద్యశిబిరం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా మధుమేహం వ్యాధి పరీక్షలను ఉచితంగా చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మానవతా స్వచ్ఛంద సేవా సంస్థ ద్వారా ప్రజలకు సేవలు అందించేందుకు ఉచిత వైద్య శిబిరాలతోపాటు ఆయా కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు చెప్పారు. స్వచ్ఛంద సంస్థ ఏర్పాటైనప్పటి నుండి ఎంతో మంది నిరాశ్రయులు, అభాగ్యులు, వృద్ధులకు సేవలు అందించినట్లు చెప్పారు. డాక్టర్ మోహన్ డయాబిటీస్ స్పెషలిస్ట్ సెంటర్ సహకారంతో ఏర్పాటు చేసిన మధుమేహం వ్యాధికి వైద్యశిబిరం ఏర్పాటు చేయడంతో చాలామంది రోగులు శిబిరానికి తరలి రావడం సంతోషంగా ఉందన్నారు. ఉచిత వైద్య శిబిరానికి సహకరించిన వైద్య సిబ్బందికి కృతజ్ఞతలు తెలిపారు. వైద్యశిబిరంలో సేవలు అందించిన విద్యార్థులకు మెమొంటోలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో డాక్టర్ మోహన్, డయాబిటీస్ స్పెషలిస్ట్ సెంటర్ మేనేజర్ సుధీర్, వైద్య సిబ్బంది కార్తీక్, శివ, రమేష్, బలరాం, శాంతి, ప్రియాంక, రిజ్వాన్, మానవత సేవా సంస్థ డైరెక్టర్లు డాక్టర్ రంగయ్య, డాక్టర్ రాజారాం, కోశాధికారి శ్రావణ్‌కుమార్, డాక్టర్ అరుణ్‌రాజు, గోపి, ధనుంజయరెడ్డి, షర్మిల, రమాదేవి, పద్మావతి, ప్రియ, నాగసుబ్బారెడ్డి, పిఇటి చంద్రశేఖర్, విద్యార్థులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న తులశీశ్వర్ యాదవ్

ముఖ్యమంత్రిగారూ..
కడప ఉక్కుపై స్పందించండి

ప్రజాశక్తి - జమ్మలమడుగు రూరల్

ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి జిల్లా మూడు రోజుల పర్యటనలో కడప ఉక్కుపై స్పందించాలని డివైఎఫ్ఐ జిల్లా సహాయ కార్యదర్శి నంద్యాల తులసీశ్వర్ యాదవ్ కోరారు. స్థానిక ఎన్జీఓ కార్యాలయంలో ఆదివారం ఆయన విలేక రులతో మాట్లాడుతూ ముఖ్యమంత్రి జగన్ కడప ఉక్కుకు రెండు సార్లు పునాదులు వేశారని, పనులు ఏమాత్రం ముందుకు సాగలేదన్నారు. కనీసం కేంద్రాన్ని కూడా మన హక్కు అయిన కడప ఉక్కుపై పార్లమెంటులో నిలదీయకపోవడం దారుణ మన్నారు. ఇక్కడి యువత ఉద్యోగాల కోసం వలసలు పోతు న్నారన్నారు. ప్రభుత్వం స్పందించదు.. ప్రజాఉద్యమ నాయకులను అడగనీయకుండా ముందస్తు నోటీసులు, అరెస్టులతో నిర్బం దిస్తున్నారని తెలిపారు. ఇప్పటికైనా ముఖ్య మంత్రి కడప ఉక్కు నిర్మాణ పనులు చేపట్టి యువతకు ఉపాధి కల్పించాలని కోరుతున్నామన్నారు. సమావేశంలో నాయకులు మహేష్ పాల్గొన్నారు.

చాపాడు : సిఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి కడపలో ఉక్కు ఫ్యాక్టరీ నిర్మాణానికి తక్షణమే పనులు చేపట్టాలని టిడిపి జిల్లా అధికార ప్రతినిధి పి.మునిశేఖర్‌రెడ్డి బహిరంగ లేఖ ద్వారా కోరారు. జమ్మలమడుగు మండలం సున్నపరాలపల్లె వద్ద 2019 ఫిబ్రవరి 15న ఉక్కు కర్మాగారం నిర్మాణం కోసం సిఎం భూమి పూజ చేశారన్నారు. 25 వేల ఉద్యోగాలు కల్పిస్తామని ఇప్పటికీ నాలుగేళ్లయిందన్నారు. రెండోసారి ఈ ఏడాది ఫిబ్రవరి 15న జెఎస్‌డబ్ల్యూ ప్రతినిధులతో కలిసి మరోసారి భూమిపూజ చేశారు. 9 నెలలు గడిచినా ఇంతవరకు ఒక పిడికెడు మట్టి కూడా ఎత్తలేదు. 2019లో జిల్లా ప్రజలు జిల్లా వాసి ముఖ్యమంత్రి అయితే స్టీల్ ప్లాంట్, ప్రాజెక్టులు, రోడ్ల నిర్మాణం వంటి అభివృద్ధి చేస్తారని మిమ్మల్ని నమ్మి 10 అసెంబ్లీ స్థానాలు, రెండు ఎంపీ స్థానాలను భారీ మెజార్టీతో గెలిపించారన్నారు. ఇకనైనా జిల్లా ప్రజలు 2024 ఎన్నికల్లో తెలుగుదేశం పార్టీ అభ్యర్థులను అత్యధిక మెజార్టీతో గెలిపించాలని, జిల్లా అభివృద్ధికి కృషి చేస్తామని ఆయన టిడిపి తరపున పేర్కొన్నారు.

మునిశేఖర్‌రెడ్డి

మాట్లాడుతున్న టిడిపి జిల్లా అధ్యక్షులు లింగారెడ్డి

ఎవరెవరో టిడిపి టికెట్ నాకే అనడం హాస్యాస్పదం

- టిడిపి జిల్లా అధ్యక్షులు లింగారెడ్డి

ప్రజాశక్తి - ప్రొద్దుటూరు (పుట్టపర్తి సర్కిల్)

పార్టీలో లేనివారు ఎవరెవరో వచ్చి ప్రొద్దుటూరు టిడిపి టికెట్ నాకే అనడం హాస్యాస్పదంగా ఉందని టిడిపి జిల్లా అధ్యక్షుడు లింగారెడ్డి తెలిపారు. స్థానిక వైఎంఆర్ కాలనీలోని తన కార్యాలయంలో ఆదివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ టికెట్ తనకే అనడం ప్రజలను, కార్యకర్తలను గందర గోళానికి గురి చేసేలా ఉందని పేర్కొన్నారు. నాలుగు దశాబ్దాలుగా టిడిపిలో తాను పనిచేశానని జిల్లాలోనే సీనియర్‌నని, తనకన్నా గతంలో టిడిపిలో పనిచేసిన వారు చాలామంది చనిపోయారని, కొంతమంది పార్టీ విడిచి వెళ్లిపోయారన్నారు. ప్రతిసారి టికెట్ కోసం తాను త్యాగం చేసేందుకు సిద్ధంగా లేనని తెలిపారు. 42 ఏళ్ల తన రాజకీయ జీవితంలో పార్టీ కోసం ఎన్నో త్యాగాలు చేశానన్నారు. ప్రొద్దుటూరు నియోజకవర్గం ప్రారంభం నుంచి తొమ్మిది సార్లు ఎన్నికలు జరిగాయని, ప్రతి ఎన్నికల్లో టిడిపి అభ్యర్థులు వరుసగా పోటీ చేసిన దాఖలాలు లేవన్నారు. 2024 ఎన్నికల్లో టికెట్ తనకేనని, పోటీ చేసేది తానేనని అన్నారు. కార్యక్రమంలో సిద్దయ్య, తెలుగు యువత కార్యదర్శి రాము నాయుడు, సుబ్బరాజు, టప్పు మహబూబ్ బాషా పాల్గొన్నారు.

మాజీ సర్పంచ్ శివారెడ్డితో మాట్లాడుతున్న భూపేష్‌రెడ్డి

పార్టీ కార్యక్రమాల నిర్వహణపై అభిప్రాయ సేకరణ

ప్రజాశక్తి - ఎర్రగుంట్ల

టిడిపి కార్యక్రమాల నిర్వహణపై ఆ పార్టీ జమ్మలమడుగు ఇన్‌ఛార్జి భూపేష్‌రెడ్డి అభిప్రాయసేకరణ చేశారు. స్థానిక పార్టీ కార్యాలయంలో మున్సిపాలిటీ, మండలంలోని నాయకులు, కార్యకర్తలతో ఆదివారం భూపేష్‌రెడ్డి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చంద్రబాబు ప్రతిష్టాత్మకంగా ప్రవేశపెట్టిన బాబు ష్యూరిటీ భవిష్యత్తుకు గ్యారంటీ కార్యక్రమాన్ని రానున్న రోజుల్లో ప్రతి ఇంటికి చేరవేసేలా అందరూ కృషి చేయాలన్నారు. టిడిపి సీనియర్ నాయకులు, వైసిపి అసమ్మతి నేతల భేటీపై సమాలోచన చేశారు. ప్రభుత్వ వైఫల్యాన్ని ప్రజల్లోకి తీసుకెళ్లేలా ప్రణాళికాబద్ధంగా ముందుకెళ్లాలని ఆయన సూచించారు. కార్యక్రమంలో ఎర్రగుంట్ల మండల ఇన్‌ఛార్జి జయరామిరెడ్డి పాల్గొన్నారు. అనంతరం వై.కోడూరు గ్రామానికి చెందిన టిడిపి మాజీ సర్పంచ్ శివారెడ్డిని గ్రామంలోని తన ఇంట్లో మర్యాదపూర్వకంగా కలిశారు. ఎర్రగుంట్ల పట్టణానికి చెందిన టిడిపి మైనార్టీ నాయకులు ఇమామ్ సాహెబ్ మనవరాలి వివాహ కార్యక్రమంలో పాల్గొన్నారు.

మహాసభలు విజయవంతం చేయండి

ప్రజాశక్తి - వేంపల్లె

ఆంధ్రప్రదేశ్ భవన నిర్మాణ కార్మిక సంఘం ఆధ్వర్యంలో చేపట్టే జిల్లా మహా సభలను భవన నిర్మాణ కార్మికులు విజయవంతం చేయాలని వేంపల్లె మండల భవన నిర్మాణ కార్మిక సంఘం అధ్యక్షుడు బి.రామంజనేయులు, ప్రధాన కార్యదర్శి చల్లా బాలాజీ కోరారు. ఆదివారం వేంపల్లెలో బాలుర పాఠశాల ఆవరణలో భవన నిర్మాణ కార్మిక సంఘం జిల్లా మహసభల కరపత్రాలను కార్మికులతో కలిసి రామాంజనేయులు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ జిల్లా మహసభలను ప్రొద్దుటూరులో జనవరి 7,8 తేదీల్లో నిర్వహిస్తున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో భవన నిర్మాణ కార్మిక సంఘం నాయకులు దస్తగిరి, నాగేశ్వరరావు, సిద్దయ్య, చలపతి, అబ్దుల్ మాలిక్, నాగేంద్ర, చిన్నోడు, అంజీ, రమణ, బాబు, వల్లి, బాలగంగులు పాల్గొన్నారు.

రాష్ట్రాభివృద్ధి చంద్రబాబుతోనే సాధ్యం

ప్రజాశక్తి - ప్రొద్దుటూరు (పుట్టపర్తి సర్కిల్)

ఎపి ప్రజల భవిష్యత్తుకు మాజీ ముఖ్యమంత్రి చంద్రబాబు గ్యారెంటీగా ఉంటారని టిడిపి ఇన్‌ఛార్జి డాక్టర్ జివి ప్రవీణ్‌కుమార్‌రెడ్డి తెలిపారు. ఆదివారం స్థానిక 41 వార్డు నెహ్రూ రోడ్డులో బాబు ష్యూరిటీ - భవిష్యత్తుకు గ్యారెంటీ పథకాలను ప్రజలకు వివరిస్తూ కరపత్రాలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో 41 వార్డు ఇన్‌ఛార్జి శూలం శివప్రసాద్, మహేష్, సుబ్బయ్య, బాలరాజు, వెంకటయ్య, బాబు, కొండయ్య, నరసింహ, వెలవలి పద్మనాభరెడ్డి, కడప పార్లమెంటు అధికార ప్రతినిధి ఆవుల దస్తగిరయ్య, 37వార్డు పొట్టిపాటి గంగాధర్, కృష్ణారెడ్డి, 34 వార్డు రాఘవ, 38 వార్డు సునీల్, 14 వార్డు మస్తాన్ గోలే, 9 వార్డు కరీముల్లా, 8 వార్డు సురసుర శ్రీనివాసులు, పర్లపాడు చంద్ర, ప్రొద్దుటూరు రూలర్ మండలం ఉపాధ్యక్షుడు షరీఫ్ కవి, పట్టణ ఉపాధ్యక్షుడు మాబుసున్న, టిడిపి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ప్రజలతో టిడిపి ఇన్‌ఛార్జి ప్రవీణ్‌కుమార్‌రెడ్డి

IN THE COURT OF THE HON'BLE COMMISSIONER FOR EMPLOYEES COMPENSATION : KADAPA
E.C.No. 02/2023
Sigamala Krishnaveni & 3 Others.
...Applicants
1. P.Viswanath Reddy
2. Shri Vardhini Enterprises Pvt.Ltd., Power Trac Tractor Showroom, Kadapa, Y.S.R.District.
3. Power Trac Tractor Showroom, Kadapa City, Y.S.R.District.
4. The Escorts Limited, Faridabad City, Haryana State.
...Opposite Parties
NOTICE TO OPPOSITE PARTY NO:3
3. Power Trac Tractor Showroom, Kadapa City, Y.S.R.District.
పై నెంబరులో అప్లికెంట్స్, ఆపోజిట్ పార్టీస్ పైన పై కోర్టులో క్లైమ్ అప్లికేషన్ దాఖలు చేసియున్నారు. అట్టి అప్లికేషన్ వాయిదా 04.01.2024వ తేదీన ఉన్నది. 3వ ఆపోజిట్ పార్టీ అయిన మీకు ఏమైన ఆక్షేపణలు ఉన్న యెడల 04.01.2024వ తేదీన పై కోర్టులో హాజరు అయి తెలుపుకోవలసినది. లేనంతట ఎక్స్‌పార్టీగా తీర్మాణించబడును.
వాయిదా తేది: 04.01.2024
//By Order of Court//
G.VIJAYAMARUTHIREDDY
K.ANITHA
Advocates, Kadapa.

IN THE COURT OF THE HON'BLE COMMISSIONER FOR EMPLOYEES COMPENSATION : KADAPA
E.C.No. 02/2023
Sigamala Krishnaveni & 3 Others.
...Applicants
1. P.Viswanath Reddy
2. Shri Vardhini Enterprises Pvt.Ltd., Power Trac Tractor Showroom, Kadapa, Y.S.R.District.
3. Power Trac Tractor Showroom, Kadapa City, Y.S.R.District.
4. The Escorts Limited, Faridabad City, Haryana State.
...Opposite Parties
NOTICE TO OPPOSITE PARTY NO:2
2. Shri Vardhini Enterprises Pvt.Ltd., Power Trac Tractor Showroom, Rep.by its Proprietor, P.Vishwanath Reddy, Opp.Nirmala College, Kadapa City, Y.S.R.District.
పై నెంబరులో అప్లికెంట్స్, ఆపోజిట్ పార్టీస్ పైన పై కోర్టులో క్లైమ్ అప్లికేషన్ దాఖలు చేసియున్నారు. అట్టి అప్లికేషన్ వాయిదా 04.01.2024వ తేదీన ఉన్నది. 2వ ఆపోజిట్ పార్టీ అయిన మీకు ఏమైన ఆక్షేపణలు ఉన్న యెడల 04.01.2024వ తేదీన పై కోర్టులో హాజరు అయి తెలుపుకోవలసినది. లేనంతట ఎక్స్‌పార్టీగా తీర్మాణించబడును.
వాయిదా తేది: 04.01.2024
//By Order of Court//
G.VIJAYAMARUTHIREDDY
K.ANITHA
Advocates,
Kadapa.